క్లుప్తంగా

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వీరన్నయాదవ్



మహబూబాబాద్ రూరల్: టీపీసీసీ ఓబీసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మేకల వీరన్న యాదవ్ నియామకం అయ్యాడు. ఈమేరకు కాంగ్రెస్ ఓబీసీ నేషనల్ చైర్మన్ అజయ్ సింగ్ యాదవ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఒకే వ్యక్తికి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు



గార్ల: ఒకే వ్యక్తికి ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించాడు. గార్ల మండలం పోచారం గ్రామానికి చెందిన భూక్యా పవన్‌కల్యాణ్ ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ పోస్టులకు ఎంపికయ్యాడు. అదేవిధంగా ఇటీవల ఎస్ఎస్‌సీ జీడీ రిక్రూట్‌మెంట్‌లో ఎస్ఎస్‌బీలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎగ్జామ్‌లో సైతం 153వ ర్యాంకు సాధించాడు. భూక్యా పాపాలాల్, లక్ష్మి దంపతుల కుమారుడు పవన్‌కల్యాణ్ నాలుగు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులతోపాటు, మండల ప్రముఖులు పీఏసీఎస్ చైర్మన్ వద్దమూడి దుర్గాప్రసాద్, ఎస్సై జీనత్‌కుమార్, సైదయ్య, వెంకయ్య అభినందించారు.

రూ.లక్ష చెక్కు అందజేత



మరిపెడ: మరిపెడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బానోతు హరి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబానికి పీఆర్టీయూ సంక్షేమ నిధి నుంచి రూ.లక్ష చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ, ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు కీసర రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

వైభవంగా కుమారి పూజలు



మహబూబాబాద్ రూరల్: దేవీ నవరాత్రి మహోత్సవ వేడుకల్లో భాగంగా మానుకోట శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో కుమారి పూజలు బుధవారం వైభవంగా జరిగాయి. తొమ్మిది మంది చిన్నారులను నవ దుర్గాలుగా భావించి వారిని ప్రత్యేకంగా వేదికలపై కూర్చోబెట్టి పూజలు చేసి సన్మానించారు. కార్యక్రమంలో చౌడవరపు మోహన్ రావు, మంజువాణి, ఇమ్మడి రవికుమార్, గీతారాణి, శ్రీరంగం కిశోర్ సుభాషిణి, సుధీర్, సుజాత పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మిక మహిళలకు చీరల పంపిణీ



మహబూబాబాద్ రూరల్: దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా మానుకోట శ్రీవాసవి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కామధేను గోశాలలో సరస్వతి దేవి జన్మనక్షత్రం మూలానక్షత్రం సందర్భంగా చిన్నపిల్లలకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మిక మహిళలకు చీరలు బహూకరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు గర్రెపల్లి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గోపు రాము, కార్యక్రమ కన్వీనర్ సోమ శ్రీనివాస్, బోనగిరి లక్ష్మీనారాయణ, బొద్దు కామేశ్వరరావు, బోనగిరి వేణుగోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్.. ముగ్గురికి గాయాలు

కేసముద్రం: రోడ్డుపై వెళ్తున్న బైక్‌ను, ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు ఢీకొట్టిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. దంతాలపల్లి మండలానికి చెందిన మౌనిక, మూడేళ్ల చిన్నారి రీతికలను సమీప బంధువు నాయకపు కనకయ్య అనే వ్యక్తి బైక్‌పై, గూడూరు నుంచి కేసముద్రం మీదుగా స్వగ్రామానికి వెళ్లేందుకు బయలుదేరారు. ఈక్రమంలో కేసముద్రంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న గూడూరు మండలం పానుగోడుకు చెందిన రమేష్ తన ట్రాక్టర్‌పై వెళ్తుండగా వెనక డబ్బా బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న కనకయ్య, మౌనిక, రీతిక కిందపడటంతో వారి కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పండుగ పూట పస్తులేనా?

- ఆరునెలలుగా వేతనాలు రాక సీఆర్టీల ఇబ్బందులు
- వీరితోనే గిరిజన పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు
- దసరా పండుగకైనా వేతనాలు అందేనా?
- పట్టించుకోని అధికారులు



గిరిజన ఆశ్రమ పాఠశాల

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులకు ఒత్తిడి భారం లేకుండా ఉండేందుకు అదనంగా సీఆర్టీలను ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వం నియమించింది. ఈ విద్యా సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా 326 ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 2,102 మంది కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ విధులు నిర్వహిస్తున్నారు. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఉత్తీర్ణత శాతం కూడా సుమారు 90శాతం విద్యార్థులు ప్రతిభ చూపించి వివిధ రంగాల్లో ముందుకు వెళ్తున్నారు. ఇటు విద్యా బోధనలోను, అటు క్రీడల్లో, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థులు ముందుండే విధంగా, వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. పాఠశాలల్లో ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు విద్యార్థులను ముందుండే విధంగా తీర్చిదిద్దుతున్నారు.

జిల్లాలో 19 ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. 108మంది సీఆర్టీ ఉపాధ్యాయులు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల నుంచి వేతనాలు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఉపాధ్యాయులు బయట అప్పులు చేసి తమ కుటుంబాలను వెల్లదీసుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు.

వేతనాలు విడుదల చేయాలి



కొద్ది నెలలుగా వేతనాలు విడుదల కాకపోవడంతో అధ్యాపకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక నెల వేతనాలు ఇస్తే తీసుకున్న అప్పులకే సరిపోతుంది. ఇంటి ఖర్చులు, పిల్లల ఫీజులతో నానా అవస్థలు పడుతున్నాం. కుటుంబం గడవడం కష్టంగా మారడంతో ఆలోచనలతో కూడా విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్యనందించలేకపోతున్నాం. అధికారులు వేతనాలు విడుదల చేసి కుటుంబాలను ఆదుకోవాలి.

– గుగులోత్ బావ్‌సింగ్, సీఆర్టీ, మానుకోట

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

బయ్యారం: మండలంలోని రామచంద్రాపురం గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించనున్న సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అదనపు కలెక్టర్ డేవిడ్ బుధవారం పరిశీలించారు. సబ్‌స్టేషన్ రెండు సంవత్సరాల క్రితం మంజూరు కాగా సర్వే నంబర్ 60లో ఎకరం భూమిని రెవెన్యూ అధికారులు కేటాయించారు. అయితే ఈ స్థలం తమకు అనుకూలంగా లేదని మరొక చోట కేటాయించాలని విద్యుత్ అధికారులు కోరారు. అయితే ఆ స్థలం అటవీశాఖ పరిధిలో ఉండడంతో.. ఫారెస్టు అధికారులతో మాట్లాడుతామని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు. జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా అటవీశాఖ కోల్పోతున్న 32 ఎకరాల భూమిని మండలంలోని రామచంద్రాపురం సమీపంలోని సర్వే నంబర్ 60లో రెవెన్యూశాఖ అటవీశాఖకు కేటాయించింది. ఈ భూమిలో రెండు శాఖల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించగా అదనపు కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ తదితరులు పాల్గొన్నారు.

బహుజనులు రాజకీయాల్లోకి రావాలి



మాట్లాడుతున్న శివరాజ్

మహబూబాబాద్ అర్బన్: కాన్షీరాం స్ఫూర్తితో బహుజన యువతీ యువకులు రాజకీయాల్లోకి రావాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో కాన్షీరాం వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్‌లు విజయ్‌కాంత్, ప్రసాద్‌రావు, జిల్లా అధ్యక్షుడు ఉపేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల శ్రీను, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉపేందర్, కోశాధికారి తప్పెట్ల చాణిక్య, డోర్నకల్ అసెంబ్లీ అధ్యక్షుడు మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మహబూబాబాద్: డీఎస్సీ ఉద్యోగ నియామక పత్రాలను నిలిపి వేసి, వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు నల్లజెండాలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు మాట ఇచ్చి తప్పినందుకే నల్లజెండాలతో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించామన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన అరగంటలోనే అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. వర్గీకరణ అమలు కాక ముందే డీఎస్సీ ఉద్యోగ నియామకాలు చేపట్టడం దారుణమన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శాగంటి రమేశ్, ప్రవీణ్, రవి, రేణుక, రజియా, శంకర్, వెంకన్న, శ్రీనివాస్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సోమయ్య

మహబూబాబాద్ అర్బన్: సీపీఎం భూ పోరాటాల కేంద్రంగా పేదల ప్రజల పక్షాన నిలుస్తుందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లిలో బుధవారం శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సూర్నపు సోమయ్య హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. మహాసభలో పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్, నాయకులు నాగన్న, వెంకన్న, శ్రీనివాసు, రాజేశ్వరి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి



తాను నాటిన మొక్క వృక్షం కాగా మొక్కుతున్న వెంకన్న

మహబూబాబాద్: ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని హరితమిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో వెంకన్న మొక్కలు నాటి ట్రీగార్డులు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను 5వ తరగతి చదువుతున్న సమయంలో తన గురువు ఐదు మొక్కలు ఇవ్వగా, వాటిని నాటానన్నారు. అవి ఇప్పుడు మహావృక్షాలు అయ్యాయని తెలిపారు. అదే స్ఫూర్తితో 16ఏళ్ల నుంచి మొక్కలు నాటడంతోపాటు పంపిణీ చేసినవి 16లక్షల మొక్కలన్నారు. మొక్కలు నాటకపోతే భవిష్యత్ తరాలకు ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలి



రిజిస్టర్ పరిశీలిస్తున్న విజయనిర్మల, వాహిని

దంతాలపల్లి: విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎరువుల షాపులను స్థానిక మండల వ్యవసాయ అధికారి వాహినితో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి షాపులో యజమానులు ఎప్పటికప్పుడు నిల్వ పట్టికలో తమ షాపులలో ఉన్న సరుకులను చూపాలన్నారు. రైతులకు ఎరువులు ఇచ్చే ముందు రైతుల ఆధార్ నంబర్ తప్పనిసరి తీసుకోవాలని సూచించారు. అనంతరం షాపుల్లో రిజిస్టర్, నిల్వలను పరిశీలించారు.

రోడ్డుపైకి ఎస్సారెస్పీ వరద నీరు

- రాకపోకలకు ఇబ్బందులు



జోగ్యాతండా వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

డోర్నకల్: మండలంలోని జోగ్యాతండా, బొడ్రాయి తండా మధ్య ఎస్సారెస్పీ కాల్వకు భారీగా వరద రావడంతో రోడ్డుపైకి నీరు ప్రవహిస్తోంది. బుధవారం ఉదయం నుంచి కాల్వకు భారీగా నీరు రావడం, కాల్వకు అక్కడక్కడా గండ్లు పడడం, కాల్వ నిండా చెట్లు, ముళ్ల పొదలు పెరగడంతో నీరంతా రోడ్డుపై ప్రవహించి, రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. బొడ్రాయితండా, జోగ్యాతండా రోడ్డులో కాల్వపై నిర్మించిన కల్వర్టు కింద ఇరుపక్కలా చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి అంతరాయం కలిగింది. దీంతో భారీగా నీరు రోడ్డుపై ప్రవహించింది. కాల్వ నిండుగా నీరు ప్రవహిస్తుండటంతో జోగ్యాతండా వైపు కాల్వకు గండి పడి ఇళ్లలోకి నీరు ప్రవహించే ప్రమాదం ఉండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణంలో ఇటీవల మృతిచెందిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుక్కల ఉదయ్ చందర్, సరస్వతి, కొంగర రిషి కుటుంబాలను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట చౌడవరపు మోహన్ రావు, శ్యాం సుందర్ శర్మ, ముల్లంగి ప్రతాప్, అశోక్, పృథ్వీరాజ్, యాకన్న, సతీష్, రామన్న, రాంబాబు, రాము ఉన్నారు.

టీఎస్ పీఆర్‌టీయూలో పలువురికి స్థానం

కురవి: టీఎస్ పీఆర్‌టీయూ 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఏర్పడిన రాష్ట్ర నూతన కమిటీలో కురవి మండలానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పి.రామ్మూర్తి బుధవారం తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా పి.రామ్మూర్తి, కె.వెంకట్‌రెడ్డి, ఎం.మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా వి.శ్యామలాదేవి, ఉపాధ్యక్షుడిగా టి.మాధవచారి, జిల్లా కమిటీలో వి.దామోదర్, టి.సునీత, ఎ.దేవేందర్‌లు ఎన్నికైనట్లు తెలిపారు.

దంతాలపల్లి: పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మండలానికి చెందిన వేణుమాధవరెడ్డి, బీరవెల్లి మహేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్‌లో జరిగిన 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా చిట్టిబాబు ఎన్నికయ్యారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపిక బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ పరిధిలోని శనిగపురం గ్రామ శివారులో రోడ్డు పక్కన ఆగి ఉన్న టిప్పరును చిన్నగూడురు మండలం జయ్యారం గ్రామానికి చెందిన వెల్ది నరేష్(34) సెప్టెంబరు 30వ తేదీ రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తూ ఢీకొనగా తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాదులోని ఓ ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. నరేష్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. తండ్రి అబ్బయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య తేజస్విని, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



నెహ్రూసెంటర్: బతుకమ్మ ఆడుతున్న ఆర్టీసీ సిబ్బంది



డోర్నకల్: సీడీపీఓ కార్యాలయంలో..

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆర్టీసీ మహిళా ఉద్యోగులు బతుకమ్మలను పేర్చి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ రుక్మిణి, గోపి, శ్రీనివాస్, రాఘవేంద్ర, పాపిరెడ్డి, సత్యనారాయణ, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం బతుకమ్మ వేడుకలు జరిగాయి. ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు బతకమ్మ ఆడారు.



మహబూబాబాద్ అర్బన్: వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ సీఈఓ నర్మద, తదితరులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బతుకమ్మ వేడుకలను బుధవారం నిర్వహించారు. జెడ్పీ సీఈఓ నర్మద, డీడబ్ల్యూ వరలక్ష్మి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎల్లయ్య

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణ అంశం పూర్తి అయిన తర్వాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని కేటీఆర్ కాలనీలో సంఘ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ ప్రక్రియ ముందుగానే పూర్తిచేస్తామని, మాదిగలకు అండగా ఉంటామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మాదిగలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ అమలు కోసం ఏకసభ్య కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని, కమిటీల పేరా కాలయాపన చేయకుండా త్వరగా ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పులి శ్రీను, రాధా, సుధా, సందీప్, బాలకృష్ణ, పద్మ, సంధ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నూతన అగ్నిమాపక వాహనం ఏర్పాటు చేయాలి



మహబూబాబాద్: కాలంచెల్లిన అగ్నిమాపక వాహనం పని చేయకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని వెంటనే నూతన అగ్నిమాపక వాహనం ఏర్పాటు చేయాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశాడు. సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు కుమార్, వెంకన్న, శ్యాంప్రసాద్, రమేశ్ పాల్గొన్నారు

బాలికల రక్షణ ప్రభుత్వ ధ్యేయం

కురవి: బాలికల రక్షణ కోసం ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీడీఓ వీరబాబు, కురవి ఎస్సై గంద్రాతి సతీష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్పెషల్ అధికారి, తహసీల్దార్ సునీల్‌రెడ్డి అధ్యక్షతన అంతర్జాతీయ బాలికల దినోత్సవం జరిగింది. కార్యదర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

డోర్నకల్/గార్ల: దైవ ప్రవక్త గౌరవాన్ని బహిరంగంగా అవమానపర్చిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్వామి నర్సింహానందపై చట్టపరమైన చర్య తీసుకోవాలని కోరుతూ బుధవారం ముస్లింలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంఏ వాజీద్, ఎస్‌కె రాజాలీ, ఎస్‌కె ముష్తి, అజాం పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

గార్ల: సపోర్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పినిరెడ్డిగూడెంలో న్యూడెమోక్రసీ గ్రామ కమిటీ నాయకులు నిరుపేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌డీ మండల కార్యదర్శి సక్రు, ఉపేందర్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

దంతాలపల్లి: మండలం బీరిశెట్టిగూడెం గ్రామంలో ఓ కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన క్రాంతి ఖమ్మం నుంచి కుటుంబ సభ్యులతో ఇనుగుర్తికి వస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామం ఎస్సీ కాలినికి చేరుకోగానే కారు అదుపు తప్పి ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం విరిగింది. కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

హామీలు అమలు చేయాలి

నెహ్రూసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి అన్నారు. జిల్లా కేంద్రంలోని హన్మంతరావుకాలనీ శాఖ మహాసభ బుధవారం నిర్వహించారు. ఈ సభలో హేమానాయక్, వెంకటస్వామి, తవీరభద్రం, రజిత, వెంకన్న, శ్రీనివాస్, జ్యోతి, దుర్గమ్మ పాల్గొన్నారు.

చీరల పంపిణీ

నెల్లికుదురు: మండలంలోని రావిరాల వరద బాధిత మహిళలకు మాజీ సర్పంచ్ వలబోజు వెంకటేశ్వర్లు రాజసులోచన దంపతులు బుధవారం 220 మందికి చీరలు అందించారు. కార్యక్రమంలో నాయకులు ఎదళ్ల యాదవరెడ్డి, గొల్లపల్లి ప్రభాకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యూరియా అధిక మోతాదులో వాడితే వరిలో దోమపోటు



గార్ల: వరిపంట పొట్టదశలో ఉన్నప్పుడు యూరియా అధిక మోతాదులో వినియోగిస్తే వరిపంటకు అగ్గితెగులు, దోమపోటు ఆశించే ప్రమాదం ఉందని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు సూచించారు. బుధవారం మండలంలోని మద్దివంచ గ్రామ సమీపంలో బాదావత్ రవి వరిపంటలో ఆయన క్షేత్ర ప్రదర్శన చేశారు. ఏఈఓ మేఘన పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గూడూరు: మండల కేంద్రంలోని చెంద్రుగూడెంకు చెందిన బందెల యమున ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెల్సుకున్న మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఖర్చుల నిమిత్తం బియ్యంతోపాటు ఆర్థికసాయం అందించాడు.

ఉన్నతస్థాయికి ఎదిగినప్పుడే గుర్తింపు



ఆత్మీయ వీడ్కోలులో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

నెల్లికుదురు: ఆదర్శపాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నస్థాయికి ఎదిగినప్పుడే ఉపాధ్యాయులకు తగిన గుర్తింపు వస్తుందని పాఠశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని అమూల్య గార్డెన్‌లో బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో 2013 నుంచి 2024వరకు విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు నిర్వహించారు. ఉపాధ్యాయుల పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అప్పటి రోజుల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.